

ప్రాజెక్టులు కళకళ.. ఆయకట్టు వెలవెల
నిండు కుండల్లా ప్రాజెక్టులు
వృథాగా పోతున్న నీరు
చివరి ఆయకట్టుకు
నీరందని దుస్థితి
7
దశాబ్దాలుగా ఇబ్బందులు.. పట్టించుకోని వైనం



ఏటీసీలో దరఖాస్తుకు నేడు చివరి తేదీ

తాండూరు, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): తాండూరులోని అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్(ఏటీసీ)లో దరఖాస్తు గడువు నేటి(శనివారం)తో ముగుస్తుంది. ఆరు కోర్సుల్లో మొత్తం 172 సీట్లు ఉండగా ఇప్పటి వరకు 90 సీట్లకు మాత్రమే దరఖాస్తులు వచ్చాయి. మరో 82 సీట్లు ఖాళీగా ఉన్నాయి. నాణ్యమైన శిక్షణ అందించేందుకు తాండూరులో ఏటీసీని ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. శిక్షణ పూర్తయిన తర్వాత ఉద్యోగాలు కల్పించేందుకు మంచి అవకాశం ఉన్నపటికీ నిరుద్యోగులు ఎవరూ ముందుకు రాకపోవడం గమనార్హం. కాగా, సెప్టెంబర్ 1 నుంచి శిక్షణ ప్రారంభం కానున్నందని ప్రిన్సిపాల్ సాయన్న తెలిపారు.

తాండూరు బల్దియాలో కంట్రోల్ రూమ్

తాండూరు, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో తాండూరు పట్టణంలో కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేశారు. వర్షాల వల్ల ఏమైన ఇబ్బందులు సంభవిస్తే వెంటనే సంప్రదించేందుకోసం 24 గంటల పాటు సిబ్బంది అందుబాటులో ఉండే విధంగా ఈ కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేశారు. ఇబ్బందులు ఉంటే 9848985792, 08411272021 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

రాయలసీమ ఎక్స్‌ప్రెస్ రద్దు

తాండూరు, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): నిజామాబాద్‌లో భారీ వర్షాలు కురుస్తున్న కారణంగా నిజామాబాద్ నుంచి తాండూరు మీదుగా తిరుపతి వెళ్లే రాయలసీమ ఎక్స్‌ప్రెస్ ట్రైన్ రద్దు చేశారు. అలాగే తాండూరు ఆర్టీసీ డిపో నుంచి భద్రాచలం.. కుంట వరకు వెళ్లే ఆర్టీసీ బస్సును భద్రాచలం వరకే పరిమితం చేశారు. వర్షాలు తగ్గిన తర్వాత రాయలసీమ ఎక్స్‌ప్రెస్‌ను పునరుద్ధరిస్తామని రైల్వే అధికారులు పేర్కొన్నారు.

నగర శివార్లలో ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తున్న 'ఫ్యూచర్ సిటీ' నిర్మాణం త్వరలోనే పట్టాలెక్కనుంది. హైదరాబాద్ సిటీపై ఒత్తిడి తగ్గించేందుకు నగర శివార్లలో అత్యాధునిక రీతిలో అన్ని హంగులతో భవిష్య నగరానికి శ్రీకారం చుట్టిన సంగతి తెలిసిందే. మహానగర భవిష్యత్తు రూపురేఖలు మార్చే విధంగా ఆర్థిక, వాణిజ్య రంగాలకు కేంద్రంగా దీన్ని తీర్చిదిద్దేందుకు అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో నిర్మాణ పనులు చేపట్టనున్నారు. ఇటీవలే ఫ్యూచర్ సిటీ పరిధి అభివృద్ధి కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక అథారిటీ (ఎఫ్‌సీడీఏ)కి కేబినెట్ ఆమోదం కూడా లభించింది. ఫ్యూచర్ సిటీ మాస్టర్ ప్లాన్ రూపొందించేందుకు కన్సల్టెన్సీ నియామకం కోసం ప్రభుత్వం త్వరలో టెండర్లు పిలవనున్నట్లు తెలిసింది. అన్ని అనుకున్నట్లు జరిగితే మరో మూడు నుంచి నాలుగు నెలల్లోపు ఫ్యూచర్ సిటీ మాస్టర్ ప్లాన్ విడుదల చేసి నిర్మాణ పనులు చకచకా చేపట్టాలని ప్రభుత్వం భావిస్తోంది.



పట్టాలెక్కనున్న ఫ్యూచర్‌సిటీ

భవిష్యనగరి మాస్టర్ ప్లాన్‌కు కసరత్తు

కన్సల్టెన్సీ కోసం త్వరలో టెండర్లు
మూడు నెలల్లో ప్రక్రియ పూర్తిచేసే అవకాశం
అతి త్వరలో గ్రీన్‌ఫీల్డ్ రోడ్డుకు శంకుస్థాపన
కంపెనీలకు భూకేటాయింపులు షురూ!



(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డిజిల్లా ప్రతినిధి) : మొత్తం ఏడు మండలాల్లోని 74 గ్రామ పంచాయతీలు (56 రెవెన్యూ గ్రామాలు) పరిధిలోని 765.28 చ.కి.మీ ప్రాంతంలో ఫ్యూచర్ సిటీ అథారిటీని ఏర్పాటు చేశారు. దీనిని ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేసేందుకు సరికొత్త మాస్టర్ ప్లాన్ కూడా ప్రభుత్వం రూపొందిస్తోంది. ఫ్యూచర్ సిటీ పరిధిలో 1.80లక్షల ఎకరాల విస్తీర్ణంలో భూములున్నాయి. ఇందులో దాదాపు 15వేల ఎకరాలను ప్రభుత్వం ఇప్పటికే సేకరించింది. మరో 15వేల ఎకరాల అటవీ ప్రాంతంలో నైట్‌సఫారీ ఇతర అటవీ పార్కులు ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేసింది. ఫ్యూచర్‌సిటీలో అతిథ్య రంగానికి పెద్ద పీట వేయనున్నారు. స్పెషల్ ఎకనామిక్ జోన్‌కు సమీపంలోని రిక్రియేషన్ జోన్లు ఏర్పాటు చేయడంతో పాటు జనావాసాలకు అనుగుణంగా జోన్లు ఏర్పాటు చేస్తున్నారు. దేశంలో తొలి నెట్‌జీరో స్మార్ట్ ఇండస్ట్రియల్ సిటీ ఇక్కడ నిర్మించబోతోంది. భవిష్యత్తు భారత నగరాలకు నమూనాగా అత్యాధునిక రీతిలో అన్ని రకాల మౌలిక సదుపాయాలతో నూతన నగరి నిర్మాణం జరగనుంది. ఎకో సిస్టమ్ జోన్లు ఏర్పాటు చేస్తున్నారు. విద్య, వైద్య, ఉపాధి, ఆరోగ్యం, పర్యాటక, క్రీడా రంగాలకు భూములు కేటాయిస్తున్నారు. ఫ్యూచర్ సిటీ అథారిటీ పరిధి శ్రీశైలం హైవే, సాగర్ హైవే, ఔటర్ రింగురోడ్డు,

మిగతా 7వ పేజీలో...



జెండా ఊపి ఆటల పోటీలను ప్రారంభిస్తున్న కలెక్టర్ ప్రతీక్ జైన్

ఉత్సాహంగా.. ఉల్లాసంగా

- కలెక్టరేట్‌లో ఘనంగా క్రీడాపోటీలు
- జెండా ఊపి ప్రారంభించిన కలెక్టర్ ప్రతీక్‌జైన్

వికారాబాద్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): జాతీయ క్రీడా దినోత్సవంలో భాగంగా కలెక్టరేట్‌లో జిల్లా యువజన క్రీడల శాఖ ఆధ్వర్యంలో ఆటల పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను కలెక్టర్ ప్రతీక్ జైన్ జెండా ఊపి ప్రారంభించారు. ముందుగా ప్రముఖ హాకీ క్రీడాకారుడు ధ్యాన్ చంద్ చిత్ర పటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. ఉద్యోగులతో కలిసి టగ్ ఆఫ్ వార్ పోటీల్లో కలెక్టర్ పాల్గొని ఉద్యోగుల్లో ఉత్సాహాన్ని నింపారు. అనంతరం 100 మీటర్ల రన్నింగ్, క్యారమ్స్ చెస్, లెమన్ స్పూన్, మ్యూజికల్ చైర్ ఆటల పోటీల్లో ఉద్యోగులు పాల్గొన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు లింగ్యానాయక్, సుధీర్, అసిస్టెంట్ కలెక్టర్ హర్ష్ చౌదరి, డీవైఎస్‌వో సత్తార్, డీఆర్డీవో శ్రీనివాస్, డిటీడబ్ల్యూవో కమలాకర్ రెడ్డి, డీడబ్ల్యూఓ కృష్ణవేణి, వ్యవసాయాధికారి రాజారత్నం, నాగార్జున, ఆడిట్ అధికారి శ్రీనివాస్ బాబు, డీటీసీడబ్ల్యూఓ మాధవరెడ్డి, హౌసింగ్ ఇన్‌చార్జి పీడీ మొక్రంబాబా, హెచ్ సెక్షన్ సూపరింటెండెంట్ నైమత్ అలీతో పాటు టీజీవో, టీఎన్జీవో, నాలుగవ తరగతి ఉద్యోగ సంఘాల నాయకులు, వివిధ శాఖల అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

నానో యూరియాతో అధిక దిగుబడి

నానో యూరియా వినియోగంతో అధిక దిగుబడి సాధించవచ్చని కలెక్టర్ ప్రతీక్ జైన్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నానో యూరియాను నేరుగా మొక్కలు, ఆకులపై పిచికారీ చేయొచ్చని, ఈ విషయాన్ని రైతులకు వివరించాలన్నారు. ఇప్పటికీ జిల్లాలో జిల్లాలో 5,431 లీటర్ల నానో యూరియా అందుబాటులో ఉందని తెలిపారు. ఎకరాకు అర లీటర్ చొప్పున మిశ్రమం చేసి పంటల్లో పిచికారి చేయాలని తెలిపారు.

మాతృ మరణాలను అరికట్టాలి

గర్భిణులకు, శిశువులకు అందించే సేవల్లో నిర్లక్ష్యం సహించబోనని కలెక్టర్ ప్రతీక్ జైన్ హెచ్చరించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులతో మాతృ మరణాలు, శిశు మరణాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లాలో మూడు మాతృ మరణాలు చోటు చేసుకున్నాయని, వాటి కారణాలను జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి లలితాదేవి వివరించారు. కలెక్టర్ మాట్లాడుతూ. తాండూరు మెటర్నిటీ ఆసుపత్రిలో బ్లడ్ బ్యాంక్ ఏర్పాటు విషయం ఉన్నతాధికారులతో చర్చిస్తానని తెలిపారు. గైనకాలజిస్టులు, వైద్య అధికారులు సమన్వయంతో పనిచేసి మాతృ శిశు మరణాలను అరికట్టాలని సూచించారు.



పరిగిలో రోడ్డుపై బైఠాయించి నిరసన వ్యక్తం చేస్తున్న మాజీ ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి, రైతులు

యూరియా కోసం రోడ్డెక్కిన రైతులు

- పరిగిలో స్తంభించిన వాహనాల రాకపోకలు..
- ధారూర్‌లో దున్నపోతుతో వినూత్న నిరసన

పరిగి/ధారూర్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): వికారాబాద్ జిల్లాలో నానాటికి యూరియా తిప్పలు పెరిగిపోతున్నాయి. రోజుకో చోట రైతులు యూరియా కోసం రోడ్డెక్కుతున్నారు. శుక్రవారం పరిగి ఆగ్రోస్ కేంద్రానికి వచ్చిన రైతులకు యూరియా లేదని చెప్పడంతో ఆగ్రహించి అక్కడే రోడ్డుపైకి వచ్చి నిరసనకు దిగారు. ఈ నిరసనకు బీఆర్ఎస్ నాయకులు మద్దతుగా నిలిచారు. మాజీ ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి రైతులకు మద్దతుగా రోడ్డుపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. జాతీయ రహదారిపై రోడ్డు బైఠాయించడంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. పోలీసులు రంగప్రవేశం చేసి రోడ్డుపై నుంచి లేవాలని కోరడంతో పోలీసులు, రైతులు, బీఆర్ఎస్ కార్యకర్తల మధ్య వాగ్వాదం జరిగింది. ఎస్ఐ మోహన కృష్ణ ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డిని అరెస్ట్ చేయడానికి యత్నించగా బీఆర్ఎస్ కార్యకర్తలు ఒక్కసారిగా నినాదాలతో హోరెత్తించారు. మహేశ్‌రెడ్డిని పోలీసులు అరెస్ట్ చేసి పోలీస్ వాహనాన్ని ఎక్కించి ఇంటికి తరలించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ యూరియా కోసం రైతులు

మిగతా 8వ పేజీలో...

వినాయక నిమజ్జనాలకు పకడ్బందీ ఏర్పాట్లు

మేడ్చల్ కలెక్టర్ మను చౌదరి.. పెద్ద చెరువు వద్ద ఏర్పాట్ల పరిశీలన

శామీర్‌పేట, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): శామీర్‌పేట పెద్ద చెరువు వద్ద వినాయక నిమజ్జనాలను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ మను చౌదరి ఆదేశించారు. శుక్రవారం శామీర్‌పేట పెద్ద చెరువు వద్ద ఏర్పాట్లను సైబరాబాద్ అదనపు డీసీపీ పురశోత్తంతో కలసి పరిశీలించారు. అక్కడ ఏర్పాటు చేసిన క్రేన్లను, విద్యుత్ లైటింగ్, శానిటేషన్, వైద్య సదుపాయం, తాగునీరు, టాయిలెట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పోలీసు, ట్రాఫిక్ బందోబస్తు, మత్స్య, ఫైర్ శాఖల వారికి కేటాయించిన విధులను సక్రమంగా నిర్వహించాలన్నారు. భక్తులు వినాయక నిమజ్జనాన్ని నిరాటంకంగా ఆనందోత్సవాలతో జరుపుకునేందుకు అధికారులు, సిబ్బంది 24 గంటల పాటు విధులను నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. గతంలో కంటె ఈ సారి ఎక్కువ వినాయక విగ్రహాలు శామీర్‌పేట పెద్ద చెరువులో నిమజ్జనం చేస్తారని, అందుకు అనుగుణంగా అవసరమైన ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఆర్టీఏ సభ్యుడు జైపాల్‌రెడ్డి, ఆర్డీవో ఉపేందర్‌రెడ్డి, శామీర్‌పేట తహసీల్దార్ యాదగిరిరెడ్డి, ఆర్‌అండ్‌బీ అధికారి శ్రీనివాస్‌మూర్తి, శామీర్‌పేట పోలీస్ ఇన్‌స్పెక్టర్ శ్రీనాథ్, ఎస్ఐ శశివర్ధన్‌రెడ్డి, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ మధుసూదన్, విద్యుత్‌శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



నిమజ్జన ఏర్పాట్లపై అధికారులు, పోలీసులతో మాట్లాడుతున్న కలెక్టర్ మను చౌదరి

నానో యూరియా వాడకం పెంచాలి

- జిల్లా వ్యవసాయ అధికారి రాజారత్నం

కులకచర్ల, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): రైతులు ప్రస్తుత పరిస్థితుల్లో నానో యూరియా వాడకాన్ని పెంచుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి రాజారత్నం సూచించారు. శుక్రవారం మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించిన ఆయన నానో యూరియా వినియోగంపై అవగాహన కల్పించారు. నానో యూరియా పర్యావరణానికి అనుకూలమైందన్నారు. లీటర్ నీటికి 2 నుంచి 4మిల్లీలీటర్ల నానో యూరియా కలిపి పిచికారీ చేసుకోవచ్చునని తెలిపారు. ఎకరానికి 50మిల్లీలీటర్ల నానో యూరియా సరిపోతుందన్నారు. 500 మిల్లీలీటర్ల బాటిల్ రూ.225 ఉంటుందన్నారు. అలాగే మండలానికి శనివారం రెండు లారీల యూరియా వస్తుందని తెలిపారు. అధిక ధరలకు విక్రయిస్తే డీలర్ల లైసెన్స్‌లు రద్దు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ ఆంజనేయులు, మొగులయ్య, పరిగి వ్యవసాయ సహాయ సంచాలకురాలు లక్ష్మీకుమారి, వ్యవసాయ అధికారి వీరస్వామి, ఏఈవోలు బాబు, నికిత, సాయితేజ పాల్గొన్నారు.



రైతులతో మాట్లాడుతున్న డీఏవో రాజారత్నం

పంట ఎర్రగా మారింది

ఈ రైతు పేరు దోచర్ల శేఖర్. కొడంగల్ మండలం టేకులకోడ్ గ్రామం. ఈ రైతు ఏడున్నర ఎకరాల్లో పత్తి సాగు చేశాడు. ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలతో పత్తి పంట పూర్తిగా ఎర్రగా మారింది. నీరు నిలవడంతో రెండు ఎకరాల్లో పూర్తిగా పాడై పూత రాలిపోయింది. మిగతా పంట కూడా ఎర్రగా మారడంతో దిగాలు పడుతున్నాడు. ఇప్పటి వరకు పత్తి పంట సాగుకు రూ.4 లక్షల పెట్టుబడి పెట్టాడు. ఏపుగా పెరిగిన పత్తి మొక్కలను చూసి ఈసారి దిగుబడి బాగా వస్తుందని ఆశ పడ్డాడు. కానీ, వర్షాలతో పత్తి పంటకు తీవ్ర నష్టం వాటిల్లడంతో బెంగ పట్టుకుంది. పెట్టుబడులైనా మిగులుతాయా అని ఆందోళన చెందుతున్నాడు.



వర్షార్పణం



కొడంగల్‌లో నీట మునిగిన పత్తి చేను

నీట మునిగిన పంటచేలు

- పరీవాహక పొలాల్లో భారీగా ఇసుక మేటలు
- ప్రాథమికంగా 2,700 ఎకరాలు గుర్తింపు
- 200 ఎకరాల ఉద్యాన పంటలు ధ్వంసం
- ఆందోళనలో రైతులు..
- ఆదుకోవాలని ప్రభుత్వానికి వేడుకోలు

వికారాబాద్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లాలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. వేల ఎకరాల్లో ఎకరాల్లో పంటలు నీట మునిగాయి. పత్తి, మొక్కజొన్న, కంది, పెసర తదితర పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. వాగులు, వంకల పరీవాహక ప్రాంతాల్లో పంటలు ఆనవాళ్లు లేకుండా నీట మునిగాయి. నీట మునిగిన పంటలు తేరుకునే సమయంలోనే మళ్లీ భారీ వర్షాలు కురవడంతో

మిగతా 8వ పేజీలో...


పంట నష్టం (ఎకరాల్లో)	
పత్తి	1,260
వరి	302
కంది	319
పెసర	379
మక్కలు	357
ఇతర	83
మొత్తం	2,700



నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

వర్షాలతో పంటలు నష్టపోయిన రైతులకు పరిహారం అందించి ఆదుకోవాలి. వేలాది రూపాయలు పెట్టుబడి పెట్టి ఎంతో ఆశతో రైతులు సాగు చేసిన పంటలు నీటమునగడంతో రైతులు కన్నీరుమున్నీరు అవుతున్నారు. పంటలను క్షేత్ర స్థాయిలో పరిశీలించి పంటలు, రైతుల వారీగా నష్టం అంచనా వేయాలి. పంటలు నష్టపోయిన రైతులకు ఎకరాకు కనీసం రూ.20 వేలుకు తక్కువ కాకుండా పరిహారం అందించి ఆదుకోవాలి.

-కోకట్ మాధవరెడ్డి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు



విభేదాలు వీడి విజయం సాధిద్దాం

కాంగ్రెస్ కార్యకర్తల సమావేశంలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

కేశంపేట/షాద్‌నగర్ అర్బన్/నందిగామ, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): కార్యకర్తలు విభేదాలు వీడి స్థానిక సంస్థల సమరంలో విజయం సాధించాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పిలుపునిచ్చారు. శుక్రవారం మండల కేంద్రంలో కేశంపేట, కొత్తూర్ మండలాల కాంగ్రెస్ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల్లో కార్యకర్తలు అహర్నిశలు కృషిచేసి తనను గెలిపించారని, వచ్చే స్థానిక ఎన్నికల్లోనూ కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించుకోవాలన్నారు. స్థానిక ఎన్నికల్లో గెలుపుపై కార్యకర్తలకు సలహాలు, సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ కేశంపేట, కొత్తూరు మండలాధ్యక్షులు గూడ వీరేశ్, జంగ నరసింహయాదవ్, మాజీ జెడ్పీటీసీ తాండ్ర విశాలశ్రవణ్ రెడ్డి, కొత్తూరు మాజీ ఎంపీపీ శివశంకర్ గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పట్లూరి జగదీశ్వరప్ప, బాల్‌రాజ్ గౌడ్, ఏఎంసీ డైరెక్టర్లు భాస్కర్ గౌడ్, కరుణాకర్, శ్రీధర్ రెడ్డి, అనుమగళ్ల రమేష్, గిరిధర్ యాదవ్, అబ్బి సుందరయ్య, మల్లేష్, ఆనంద్ రెడ్డి, అనసూయమ్మ, సురేష్ మాదిగ, రావులు పెంటయ్య తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

టౌన్‌షిప్ సమస్యలను పరిష్కరిస్తా..

షాద్‌నగర్ మున్సిపాలిటీలోని శ్రీ సాయి బాలాజీ టౌన్ షిప్‌లో నెలకొన్న సమస్యలను పరిష్కరిస్తానని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. టౌన్‌షిప్‌లో అమృత్-2 తాగునీటి పథకంలో భాగంగా రూ.5 కోట్లతో చేపట్టే పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మున్సిపాలిటీలో ఇంటింటికీ తాగునీటిని అందించాలనే లక్ష్యంగా పనిచేస్తున్నామని తెలిపారు. టౌన్‌షిప్‌లో డ్రైనేజీ, సీసీ రోడ్లు, విద్యుత్ సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సునిత, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్‌ఖాన్, కాంగ్రెస్ నాయకులు చెంది తిరుపతిరెడ్డి, రఘునాయక్, శివశంకర్ గౌడ్, చల్లా శ్రీకాంత్‌రెడ్డి, కొప్పునూరి ప్రవీణ్‌కుమార్, కరుణాకర్, ముబారక్, ఖదీర్, మురళీమోహన్, నలమోని శ్రీధర్, రాజారెడ్డి, మురళీధర్‌రావు, శ్రీనివాస్, బాలునాయక్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి కృషి

నందిగామ మండల కేంద్రంలోని వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. ఎస్‌డీఎఫ్ నిధులు రూ.15 లక్షలతో ఆలయ ముఖద్వారంతోపాటు కమ్యూనిటీ హాల్, ప్రహరీ నిర్మాణానికి భూమిపూజ చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ శివశంకర్‌గౌడ్ నాయకులు రాంరెడ్డి, బాల్‌రెడ్డి, కృష్ణ, చంద్రపాల్‌రెడ్డి, కుమార్‌గౌడ్, నర్సింలు, రాజగోపాల్, కె.వెంకట్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.


ఆర్‌వో ప్లాంటును ప్రారంభిస్తున్న ఎంపీ ఈటల రాజేందర్

పాఠశాలల్లో సౌకర్యాల కల్పనే లక్ష్యం

ఎంపీ ఈటల రాజేందర్

శామీర్‌పేట, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో సౌకర్యాలలు కల్పించడమే లక్ష్యమని మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. శుక్రవారం శామీర్‌పేటలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమానికి హాజరయ్యారు. విద్యార్థులకు కొత్త బెంచీలను, ఫర్నిచర్ అందజేశారు. ఆర్‌వో ప్లాంట్‌ను ప్రారంభించారు. భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్, మహిత ఎన్జీవో సహకారంతో పాఠశాలకు ఫర్నిచర్, ఆర్‌వో ప్లాంటును అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో సౌకర్యాల కల్పనకు దాతలు సహకరించాలని పిలుపునిచ్చారు.

ఆలయ హుండీ లెక్కింపు

కులకచర్ల, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): కులకచర్ల మండలంలోని బండవెల్కిచర్ల పాంబండ ఆలయ హుండీ ఆదాయాన్ని శుక్రవారం లెక్కించారు. మొత్తం రూ.2,67,710 ఆదాయం వచ్చినట్లు ఆలయ చైర్మన్ కోట్ల మైపాల్‌రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈవో బాలనర్సయ్య, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

ప్రీప్రైమరీ స్కూల్ ప్రారంభం

కొందుర్గు, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి) : కొందుర్గు మండల పరిధిలోని విశ్వనాథ్‌పూర్ గ్రామంలో 2025-26 సంవత్సరం ప్రీప్రైమరీ విద్యాభ్యాసం ప్రారంభించనున్నట్లు మండల విద్యాధికారి గాయత్రిదేవి శుక్రవారం ప్రకటనలో తెలిపారు. ప్రీప్రైమరీ విద్య బోధన కోసం ఒక టీచర్ పోస్టు, ఆయా కోసం ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఈనెల 30వ తేదీ నుంచి సెప్టెంబర్ 6వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడిపై కేసు

ధారూరు, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): ధారూరు-వికారాబాద్ రోడ్డుపై అనుమతి లేకుండా రాస్తారోకో చేసిన మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు మెతుకు ఆనంద్‌తో పాటు 20 మంది బీఆర్ఎస్ నాయకులపై కేసు నమోదు చేసినట్లు ధారూరు సీఐ రఘురాం తెలిపారు. బీఆర్ఎస్ నాయకులు శుక్రవారం రోడ్డును అడ్డగించి వాహనాల రాకపోకలకు అంతరాయం కల్పించి ప్రయాణికులకు అసౌకర్యం కలిగించారని ఆయన తెలిపారు. ఆనంద్‌తో పాటు, మండలాధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, నాయకులు వేణుగోపాల్‌రెడ్డి, విజయ్, చిన్నయ్య గౌడ్, రాములు, రహిమతుల్లా ఖాన్, గోవింద్ రాజ్‌గౌడ్, జైపాల్‌రెడ్డి, లక్ష్మయ్య, జహంగీర్, చాన్, తదితరులపై కేసు నమోదయ్యాయి.

స్వాతి కుటుంబానికి అండగా బీసీ సమాజం

ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న

వికారాబాద్, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): భర్త చేతిలో దారుణంగా హత్యకు గురైన స్వాతి కుటుంబానికి బీసీ సమాజం అండగా ఉంటుందని ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న పేర్కొన్నారు. శుక్రవారం వికారాబాద్ మండలం కామారెడ్డిగూడలో స్వాతి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. కుటుంబమంతా కలిసి పక్కా ప్రణాళికతోనే స్వాతిని హత్య చేశారని ఆరోపించారు. మేడిపల్లిలో మహేందర్ రెడ్డి ప్రేమించి పెళ్లి చేసుకున్న బీసీ బిడ్డ స్వాతిని హత్య చేయడం దారుణమని, హత్య జరిగిన ముందు రోజే గ్రామం నుంచి మహేందర్ రెడ్డి తల్లిదండ్రులు వెళ్లారని తెలుస్తోందన్నారు. మేడిపల్లి సీఐ గోవర్ధన్ రెడ్డి హంతకుడు మహేందర్ రెడ్డి ఒక్కడినే అదుపులోకి తీసుకుని కుటుంబ సభ్యులను కాపాడారని ఆరోపించారు. ఆయనపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రెడ్డి సామాజికవర్గానికి చెందిన వ్యక్తి కావడంతో క్షేమంగా జైలుకు పంపిస్తున్నారని, వెంటనే మహేందర్ రెడ్డి కుటుంబాన్ని అరెస్ట్ చేయాలన్నారు. రాష్ట్రంలో బీసీ బిడ్డపై ఇలా జరిగితే పట్టించుకోరా అని ప్రశ్నించారు. అధికారులపై చర్యల కోసం అవసరమైతే ఢిల్లీ వరకు వెళ్లేందుకు సిద్ధమని, శాసన మండలిలో సైతం ఈ అంశంపై మాట్లాడుతానన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ బీసీ పొలిటికల్ జేఏసీ రాష్ట్ర కమిటీ చైర్మన్ సుదగాని హరిశంకర్ గౌడ్, బీసీ పొలిటికల్ జేఏసీ సమన్వయకర్త వట్టే జానయ్య యాదవ్, ఓదేలు యాదవ్, నాగరాజు, రవీందర్, వెంకటేశ్వర్లు యాదవ్, బొడ్డుపల్లి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.


స్వాతి కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న





విధి నిర్వహణలో ఆదర్శవంతంగా ఉండాలి

మేడ్చల్ కలెక్టర్ మనుచౌదరి

కీసర రూరల్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో అధికారులు ఆదర్శవంతంగా ఉండాలని మేడ్చల్ కలెక్టర్ మనుచౌదరి అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి గోపాల్‌రావు పదవీ విరమణ కార్యక్రమం నిర్వహించారు. ఆయనను శాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛాలు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గోపాల్ రావు 35 ఏళ్ల అధికారిగా 14 జిల్లాల్లో పని చేసి ఇతర ఉద్యోగులకు ఆదర్శంగా నిలిచారన్నారు. పదవీ విరమణ రోజున బాలికలు క్రీడల్లో రాణించాలనే ఉద్దేశ్యంతో వారికి సైకిళ్లు వచ్చేలా కృషి చేశారన్నారు. ముందుగా హాకీ క్రీడాకారుడు ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు విజయేందర్‌రెడ్డి, రాధికాగుప్తా, డీఆర్వో హరిప్రియ, డీఆర్డీఓ సాంబశిరావు, ఎస్సీ సంక్షేమ శాఖ అధికారి వినోద్‌కుమార్, జిల్లా మైనారిటీ అధికారి కాంతమ్మ, డీఎంహెచ్ఓ ఉమాగౌరీ, బీసీ వెల్ఫేర్ అధికారి ఝాన్సీరాణి, సివిల్ సప్లై డీఎం సుగుణాబాయి, ఏవో రామ్మోహన్, అధికారులు శ్రీనివాస్‌రెడ్డి, శివప్రసాద్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



గోపాల్‌రావును సన్మానిస్తున్న కలెక్టర్ మనుచౌదరి



కేజీబీవీని సందర్శించిన కడా అధికారులు

కొడంగల్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): కొడంగల్ పట్టణంలోని కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాల, కళాశాలను కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ బలరాంనాయక్ శుక్రవారం సందర్శించారు. పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న భోజనం, తరగతి గదులు, వంట గది తదితర వాటిని పరిశీలించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని సూచించారు. తరగతి గదులు, డైనింగ్ హాల్ సరిపోవడం లేదని ప్రత్యేకాధికారి స్రవంతి అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. నివేదిక తయారు చేసి పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటామని కడా ప్రత్యేకాధికారి తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఎన్.ప్రశాంత్ పాల్గొన్నారు.


విద్యార్థులతో మాట్లాడుతున్న కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి







చిరస్మరణీయుడు సర్వాయి పాపన్నగౌడ్


సర్వాయి పాపన్నగౌడ్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్

శంషాబాద్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): అనగారిన వర్గాలు, బహుజనుల ఐక్యత కోసం పోరాడిన సర్దార్ సర్వాయిపాపన్నగౌడ్ చిరస్మరణీయుడని ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ అన్నారు. శంషాబాద్ మండలం ననాజీపూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ విగ్రహాన్ని శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పాపన్నగౌడ్ పేదల అభ్యున్నతికి ఎంతగానో పోరాడారన్నారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ నీరటి తన్వీరాజు, గౌడ సంఘం నాయకులు పాల్గొన్నారు.

అందుబాటులో యూరియా.. ఆందోళన వద్దు

పరిగి,ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): యూరియా కోసం రైతులు ఆందోళన చెందరాదని జిల్లా వ్యవసాయాధికారి రాజరత్నం, పరిగి ఏఎంసీ చైర్మన్ పరుశరాంరెడ్డి, ఆత్మ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. శుక్రవారం సాయంత్రం పరిగిలోని వ్యవసాయ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. పరిగిలోని షాపుల్లో యూరియా బస్తాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. పరిగిలోని మనగ్రోమోర్ సెంటర్‌లో 193 బస్తాలు, గౌరిశంకర్ షాపులో 618, లక్ష్మీనరసిహ్మషాపులో 287 బస్తాలు, ఆగ్రోస్‌లో 20, గణపతి గడిసింగాపూర్, ఆగ్రోస్ రాఘవాపూర్‌లలో యూరియా అందుబాటులో ఉందని తెలిపారు. ఇంకా వస్తుందని, రైతులు ఆందోళన చెందరాదని సూచించారు. ప్రస్తుతం రైతులు పత్తిపంటకు నానో యూరియాను పిచికారీ చేస్తే పంట బాగా వస్తుందని తెలిపారు. సమావేశంలో ఏడీఏ లక్ష్మీకుమారి, ఏవో రజిత, ఏఈవోలు పాల్గొన్నారు.

పట్టాలెక్కనున్న ఫ్యూచర్‌సిటీ

(ఐదో పేజీ తరువాయి)

రీజినల్ రింగురోడ్డు మధ్యలోనే ఉంది. ఫ్యూచర్ సిటీకి దక్షిణాన రీజినల్ రింగురోడ్డు, ఉత్తరాన ఔటర్ రింగురోడ్డు, అలాగే పడమర శ్రీశైలం హైవే, తూర్పున నాగార్జున సాగర్ హైవే మధ్య ఉన్న ప్రాంతాలన్నీ ఉంటాయి. ఫ్యూచర్ సిటీకి అన్ని వైపులా కనెక్టివిటీ కోసం కొత్త రహదారుల నిర్మాణాలు కూడా చేపడుతోంది. ఈప్రాంత పరిధిలో రూపొందిస్తున్న మాస్టర్ ప్లాన్‌కు సంబంధించి సర్కార్ కీలక నిర్ణయం తీసుకుంది. ఫ్యూచర్ సిటీ మాస్టర్ ప్లాన్ రూపొందించేందుకు కన్సల్టెన్సీ నియామకం కోసం ప్రభుత్వం త్వరలో టెండర్లు పిలవనున్నట్లు తెలిసింది. అన్ని అనుకున్నట్లు జరిగితే మరో మూడు నుంచి నాలుగునెలల్లోపు ఫ్యూచర్ సిటీ మాస్టర్ ప్లాన్ విడుదల చేసే అవకాశాలు ఉన్నాయి. ఇటీవల జరిగిన ఉన్నతస్థాయి సమావేశంలో అధికారులు కొంత సమయం అడిగినప్పటికీ సీఎం రేవంత్‌రెడ్డి వీలైనంత త్వరగా మాస్టర్ ప్లాన్ రూపొందించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వాస్తవానికి ఫ్యూచర్ సిటీలోని 56 రెవెన్యూ గ్రామాల్లో 30 గ్రామాలు హెచ్‌ఎండీఏ పరిధిలో ఇప్పటికే ఉన్నందున కొత్తగా రూపొందించే మాస్టర్ ప్లాన్‌కు ఉపయోగకరంగా ఉంటుంది. మిగతా 26 రెవెన్యూ గ్రామాలకు సంబంధించిన సమాచారం క్రోడీకరించి దీనిపై అధ్యయనం చేయాల్సి ఉంటుంది. మాస్టర్ ప్లాన్ వీలైనంత త్వరగా విడుదల చేసి మిగతా నిర్మాణ పనులు చకచకా చేపట్టాలని ప్రభుత్వం భావిస్తోంది.



ఫ్యూచర్ సిటీపై కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటన చేసి ఇప్పటికే దాదాపు ఏడాదిన్నర పుతుంది. ప్రభుత్వం అనుకున్న విధంగా ఇక్కడ పనులు మొదలు కాలేదు. ఫ్యూచర్ సిటీలో పెట్టుబడులు పెట్టేందుకు పలు వ్యాపార కంపెనీలు, రియల్ ఎస్టేట్ సంస్థలు ఆసక్తిగా ఉన్నాయి. అయితే మాస్టర్ ప్లాన్ పూర్తయితేనే ఇక్కడ నిర్మాణ పనులు ఊపందుకునే అవకాశాలు ఉంటాయి. తాము భూములు కొనుగోలు చేసినా చివరకు మాస్టర్ ప్లాన్‌లో ఈ ప్రాంతం ఏ జోన్‌లో ఉంటుందోననే ఆందోళన పెట్టుబడిదారుల్లో ఉంది. అందుకే ఇక్కడ భూముల క్రయవిక్రయాలు ఇంకా ఊపందుకోలేదు.

ఊరటనిస్తారా?

ఫార్మాసిటీ ఏర్పాటు సమయంలో ఈ ప్రాంతంలోని కొన్ని గ్రామాలను బఫర్ జోన్‌లో అప్పటి ప్రభుత్వం పెట్టింది. ఫార్మాసిటీకి ఏడు కిలో మీటర్ల దూరం వరకు బఫర్ జోన్ ఉంటుందని, అందువల్ల ఇక్కడ నిర్మాణాలకు అనుమతి ఇవ్వరాదని అప్పటి ప్రభుత్వం నిర్ణయించింది. అయితే దీనిపై అధికారిక ఉత్తర్వులు ఇవ్వలేదు. దీనిపై అప్పట్లో స్థానికుల నుంచి పెద్ద ఎత్తున నిరసన వ్యక్తం కావడంతో బఫర్ పరిధిలోని ఒక కిలో మీటర్ పరిధికి కుదించారు. అప్పటి నుంచి ఈ ప్రాంతాల్లో భూముల క్రయ విక్రయాలు జరగడం లేదు. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఫార్మాసిటీకి బదులు ఫ్యూచర్ సిటీ నిర్మిస్తామని ప్రకటించింది. కానీ ఇంతవరకు ఈ బఫర్ జోన్ మాత్రం తొలగించలేదు. దీంతో వీటి పరిధిలోకి వచ్చే గ్రామాల్లో భూముల ధరలు పెరగలేదు. పైగా భూముల రిజిస్ట్రేషన్లు కూడా నిలిచిపోయాయి. ఇప్పుడు ప్రభుత్వం ఫ్యూచర్ సిటీ పరిధిలో కొత్తగా మాస్టర్ ప్లాన్ రూపొందిస్తుండడంతో తమకు ఇబ్బందులు తొలుగుతాయామోనని స్థానికులు ఆశతో ఎదురు చూస్తున్నారు. ఫార్మాసిటీకి బదులు ఫ్యూచర్‌సిటీ ఏర్పాటు చేస్తున్నా తమ భూములపై ఆంక్షలు తొలగించడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

త్వరలో గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు పనులు

ఫ్యూచర్ సిటీ కోసం ప్రభుత్వం ప్రత్యేకంగా నిర్మిస్తున్న 330 అడుగుల గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు నిర్మాణ పనులను ముందుగా పూర్తి చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ రోడ్డు నిర్మాణం పూర్తయితే ఫ్యూచర్ సిటీ నిర్మాణాలు ఊపందుకుంటాయని సర్కార్ భావిస్తోంది. ఔటర్ రింగురోడ్డు నుంచి ఫ్యూచర్ సిటీని కలుపుతూ రీజినల్ రింగురోడ్డు వరకు 41.5 కి.మీ మేర నిర్మిస్తున్న 330 అడుగుల గ్రీన్‌ఫీల్డ్ రహదారి పనులకు త్వరలోనే ప్రభుత్వం శంకుస్థాపన చేయనుంది. వారం, పదిరోజుల్లో గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు నిర్మాణ పనులకు సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా శంకుస్థాపన చేసేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. అలాగే అదే రోజు ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ (ఎఫ్‌సీడీఏ) భవనానికి కూడా సీఎం శంకుస్థాపన చేయనున్నారు. ఇదిలా ఉంటే గ్రీన్ ఫీల్డ్ రోడ్డు నిర్మాణ పనులు రెండు దశల్లో జరగనున్నాయి. తొలిదశలో రావిర్యాలలోని ఔటర్ రింగురోడ్డు ఎగ్జిట్ 13 నుంచి ఫ్యూచర్ సిటీలోని మీర్‌ఖాన్‌పేట పరిధిలోని స్కిల్ డెవలప్‌మెంట్ యూనివర్సిటీ వరకు 19.2 కిలో మీటర్ల మేర గ్రీన్‌ఫీల్డ్ రహదారి నిర్మిస్తారు. రెండో దశలో మీర్‌ఖాన్‌పేట నుంచి ఆమన్‌గల్ రీజినల్ రింగురోడ్డు వరకు 22.3 కిలోమీటర్ల మేర రోడ్డు నిర్మాణం చేపడతారు. ఈ ఆరు లేన్ల గ్రీన్‌ఫీల్డ్ రహదారి వెంటే స్కిల్ యూనివర్శిటీ వరకు మెట్రో రైలు నిర్మాణం కూడా ప్రభుత్వం చేపడుతోంది.



మాట్లాడుతున్న రాచకొండ సీపీ సుధీర్‌బాబు

నిమజ్జన ఏర్పాట్ల పరిశీలన

ఘట్‌కేసర్ రూరల్, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): ఘట్‌కేసర్ మున్సిపాలిటీ, ఎదులాబాద్ లక్ష్మీనారాయణ చెరువు కట్ట వద్ద శుక్రవారం రాత్రి రాచకొండ పోలీసుకమీషనర్ సుధీర్‌బాబు వినాయక నిమజ్జన ఏర్పాట్లను పరిశీలించారు. చెరువు వైపు ఉన్న బారికేడ్ల లోపలికి ఎవరూ వెళ్లకుండా అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ఎప్పటికప్పుడు సీసీ కెమెరాలను పరిశీలిస్తుండాలన్నారు. అధికారులు అందుబాటులో ఉంటూ ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలన్నారు. ప్రశాంతంగా వినాయక నిమజ్జనం జరిగేలా ప్రతిఒక్కరూ సహకరించాలని కోరారు. అనంతరం ఘట్‌కేసర్ పోలీసుస్టేషన్‌ను సందర్శించి రికార్డులను పరిశీలించారు. కేసుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. అయన వెంట భువనగిరి డీసీపీ ఆకాంక్ష యాదవ్, ఏసీపీ రాహుల్‌రెడ్డి, ఉప్పల్ ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాసులు, మున్సిపల్ కమిషనర్ పంజాల రాజేష్, సీఐ ఎం. బాలస్వామి, ట్రాఫిక్ సీఐ రవీందర్, ఎస్‌ఐ శేఖర్, నాయకులు ఉదయ్‌కుమార్‌రెడ్డి, సామల అమర్, రాజేందర్ గౌడ్, యుగేందర్‌గౌడ్, సిబ్బంది పాల్గొన్నారు.



భూమిపూజ చేస్తున్న జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేశ్‌రెడ్డి

గ్రామాల అభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యం

దుద్యాల, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): గ్రామాల అభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యమని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేశ్‌రెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఆకారం వేణుగోపాల్ అన్నారు. శుక్రవారం దుద్యాల మండలంలోని చెట్టుపల్లి తండాలో రూ.30 లక్షలతో నిర్మించే పంచాయతీ భవన నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధిహామీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు నర్సిములుగౌడ్, పీఏసీఎస్ చైర్మన్ జయకృష్ణ, వెంకట్రాములుగౌడ్, శేఖర్, మెరుగు వెంకటయ్య, సీసీ వెంకటయ్యగౌడ్, పులిందర్‌రెడ్డి, రవీందర్ నాయక్, కృష్ణ, రవినాయక్, శ్రీశైలం, శ్రీశైలంగౌడ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సబితారెడ్డి

'స్థానిక' ఎన్నికల్లో బీఆర్‌ఎస్ సత్తా చాటాలి

» మహేశ్వరం ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి

మహేశ్వరం, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న కాంగ్రెస్‌కు స్థానిక సంస్థల ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి బీఆర్‌ఎస్ కార్యకర్తలకు సూచించారు. స్థానిక ఎన్నికల్లో బీఆర్‌ఎస్ సత్తా చాటాలని పిలుపునిచ్చారు. శుక్రవారం మండల బీఆర్‌ఎస్ కార్యకర్తల సమావేశం మండల కేంద్రంలో నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు అవుతున్నా ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీల్లో కనీసం మూడింటినైనా అమలు పర్చడం లేదని విమర్శించారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో చేసిన అభివృద్ధి తప్పా కాంగ్రెస్ చేసిందేమీ లేదని. ఈ విషయం ప్రజలకు వివరించడంలో నాయకులు, కార్యకర్తలు చురుకైన పాత్ర పోషించాలన్నారు. స్థానిక ఎన్నికల్లో గ్రామాల్లో సర్పంచులు, ఎంపీటీసీలు, జడ్పీటీసీ, చివరకు వార్డు సభ్యులైనా సరే ఎన్నికల్లో పోటీ చేయాలనుకుంటే నాయకులు, కార్యకర్తలతో చర్చించి సాధ్యమైనంత వరకు ఒక్క స్థానంలో ఒక్కరే పోటీ చేసేలా చూడాలన్నారు. ఓటర్ల జాబితాను జాగ్రత్తగా సరిచూసుకోవాలన్నారు. నాయకులు రాజునాయక్, పాండుయాదవ్, వెంకటేశ్వర్‌రెడ్డి, నవీన్, కె.చంద్రయ్య, ఎం.రాఘవేందర్‌రెడ్డి, నందం, యాదయ్య, జంగయ్య, జానారెడ్డి, రమేష్, వీరుబాబు, ప్రభాకర్, ఆదిల్ తదితరులు పాల్గొన్నారు.



చెక్కులు అందిస్తున్న ఎమ్మెల్యే యాదయ్య

పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

చేవెళ్ల, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య తెలిపారు. శుక్రవారం చేవెళ్ల పట్టణ కేంద్రంలోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే పలువురు లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్, కల్యాణలక్ష్మి చెక్కులను అందించారు. ఆయన మాట్లాడుతూ 66 మందికి సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు, కల్యాణలక్ష్మి, షాదీముబారక్ కింద రూ.11,01,276 లక్షల చెక్కులు అందించినట్లు చెప్పారు. తహసీల్దార్ కృష్ణయ్య, పీఏసీఎస్ చైర్మన్లు వెంకట్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు వీరేందర్‌రెడ్డి, మున్సిపల్ అధ్యక్షుడు బి.శ్రీనివాస్‌గౌడ్, మాజీ సర్పంచ్ శైలజా ఆగిరెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మండల కేంద్రం ఏర్పాటుకు ఆమరణ నిరాహార దీక్ష

» తీర్మానించిన గట్టిప్పలపల్లి గ్రామస్తులు

తలకొండపల్లి, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గట్టిప్పలపల్లిని మండల కేంద్రంగా ఏర్పాటు చేయాలని నెలల కాలంగా దీక్షలు చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని జేఏసీ నాయకులు అన్నారు. సెప్టెంబరు 3వ తేదీ వరకు ప్రభుత్వం స్పందించకపోతే, స్థానిక ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి పట్టించుకోకపోతే మరుసటి రోజు నుంచి ఆమరణ నిరహార దీక్ష చేపడుతామని హెచ్చరించారు. గట్టిప్పలపల్లి గ్రామంలో శుక్రవారం జేఏసీ నాయకులు నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. భవిష్యత్ కార్యాచరణపై సన్నాహక సమావేశం నిర్వహించారు. రిలే నిరాహార దీక్షలను ఆమరణ నిరహార దీక్షగా మార్చాలని తీర్మానించారు. మండల కేంద్రం ఏర్పాటు చేసే వరకు ఎంతటి పోరాటాలకైనా వెనుకాడబోమని స్పష్టం చేశారు. 11 గ్రామ పంచాయతీలను కలిపి గట్టిప్పలపల్లిని మండల కేంద్రంగా ప్రభుత్వం ప్రకటించాలని డిమాండ్ చేశారు.

ప్రాజెక్టులు కళకళ.. ఆయకట్టు వెలవెల

కలిసొచ్చిన కాలం.. కొరవడిన నీటి వినియోగం

» నిండు కుండల్లా ప్రాజెక్టులు

» వృథాగా పోతున్న నీరు

» చివరి భూములకు నీరందని వైనం



జుంటుపల్లి ప్రాజెక్టు

తాండూరు, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): కురుస్తున్న వర్షాలకు తాండూరు ప్రాంతంలోని ప్రాజెక్టులన్నీ నీటితో కళకళలాడుతున్నాయి. కాలం కలిసొచ్చి నదులు, ప్రాజెక్టు, చెరువు, కుంటలు నిండుతున్నా ఆ నీటిని పూర్తి స్థాయిలో వినియోగించుకునేలా చేయడంలో అధికారులు, పాలకులు విఫలమయ్యారు. జిల్లాలోనే పెద్దదైన కోట్‌పల్లి ప్రాజెక్టు ఐదేళ్లుగా 24ఫీట్ల మేర నీరుచేరి అలుగు పారుతున్నా ఈ ప్రాజెక్టు ఆయకట్టు పరిధి 9,200 ఎకరాల్లో కేవలం ఐదు వేల ఎకరాలకు మాత్రమే నీరు అందుతోంది. 1982లో ఆయకట్టు మొత్తానికి నీరందగా.. కాలక్రమేనా పారకం విస్తీర్ణం పడిపోయింది. కాలువలు పూడుకుపోయాయి. పది వేల మందికిపైగా రైతుల భూముల్లో నీరు పారడం లేదు. కొన్నేళ్లుగా జపాన్ నిధులతో తలపెట్టిన మరమ్మతులు ప్రతిపాదనలకే పరిమితమయ్యాయి. పనులకు రూ.100కోట్ల వ్యయం అవుతుందని గతంలో అంచనా వేశారు. అప్పట్లో ప్రాజెక్టు నిర్వహణకు 12మంది గ్యాంగ్‌మెన్లు విధుల్లో ఉండి కాల్వలను తనిఖీ చేసేవారు. మరమ్మతులు అవసరమైతే అధికారులకు సమాచారమిచ్చేవారు. రిటైరైన గ్యాంగ్‌మెన్ స్థానంలో కొత్తవారిని నియమించలేదు. ప్రస్తుతం ఇద్దరే ఉన్నారు. కాగా, తాండూరు కాగ్నా నదిపై నిర్మించిన చెక్‌డ్యాంతో కర్ణాటక రాష్ట్రం యాద్గీర్ భీమా నదికి నీరు తరలకుండా నివారించుకోగలిగాం. అయితే 35మిలియన్ క్యూబిక్ మీటర్ల నీటి సామర్థ్యం గల ఈ చెక్‌డ్యాం నిండి వరద కర్ణాటకకు తరలుతోంది. 2016 నుంచి చెక్‌డ్యాంలో నీరుంటున్నా భూగర్భ జలమట్టం పెంపునకే ఉపయోగపడుతోంది తప్ప నేరుగా నది నుంచి నీరు పారడం లేదు. ఇక్కడ లిఫ్ట్ పెడితే పొలాలకు నీటిని పారించొచ్చు.

భూములకందని నీరు

యాలాల మండలం జుంటుపల్లి ప్రాజెక్టు 20ఫీట్ల పూర్తి సామర్థ్యానికి చేరి అలుగెల్లుతోంది. మరింత నీటి నిల్వకు అలుగు ఎత్తును పెంచాల్సి ఉంది. ఈ నీటిని రబీ సాగుకు వదులుతున్నా చివరి ఆయకట్టుకు నీరందడం లేదు. తాండూరు మండలం అల్లాపూర్‌లోని శ్రీరాములవారి ప్రాజెక్టు 600 ఎకరాలకు నీరందిస్తోంది. యాలాల మండలం విశ్వనాథ్‌పూర్ సమీపంలోని కాక్రవేణి నదిపై శివసాగర్ ప్రాజెక్టు నిర్మాణానికి 2005లోనే అప్పటి ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖర్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. ప్రాజెక్టు ఇంకా నిర్మాణ దశలోనే ఉంది. 1,200 ఎకరాలకు నీరందించేలా ఈ ప్రాజెక్టుకు అలుగు నిర్మాణించినా కొందరు నిర్వాసిత రైతులకు పరిహారం చెల్లించక కాల్వల పనులు పెండింగ్‌లో ఉన్నాయి. శివసాగర్ ప్రాజెక్టులో నీరు పుష్కలంగా ఉన్నా సాగుకు పారించడం లేదు. నీరంతా కాగ్నా నదిలోకి వెళ్తోంది. బషీరాబాద్ మండలం నవాంద్గి ఎత్తిపోతల పథకం పనిచేయక 600 ఎకరాలు బీడుబారాయి. నవాంద్గి ఎత్తిపోతల మరమ్మతుల పేరిట అలంకారప్రాయంగా మారింది. గతంలో ప్రభుత్వం ఈ ప్రాజెక్టుల నుంచి నీటిని చెరువులు, కుంటల్లోకి తరలించేలా గొలుసుకట్టు ప్రణాళికను రూపొందించింది. అయితే దశాబ్దాలు గడిచినా ప్రణాళికలు మాత్రం అమలు చేయడం లేదు.

గణేశ్ శోభాయాత్రకు సహకరించాలి

» మేడ్చల్ అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి



ఏర్పాట్లను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి

ఘట్‌కేసర్ రూరల్, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): భక్తులకు ఇబ్బందులు కలుగకుండా వినాయక శోభాయాత్ర, నిమజ్జనానికి పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ఘట్‌కేసర్ మున్సిపాలిటీ ఎదులాబాద్‌లోని లక్ష్మీనారాయణ చెరువును శుక్రవారం మున్సిపల్ కమిషనర్ పంజాల రాజేష్‌తో కలిసి పరిశీలించారు. అధికారుల సమన్వయంతోనే వినాయక నిమజ్జనం విజయవంతం అవుతుందన్నారు. గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచాలన్నారు. కార్యక్రమంలో ఆర్‌ఐ సాయిరాం, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

భూ భారతి దరఖాస్తులను పరిష్కరించాలి

తహసీల్దారు కార్యాలయాన్ని మేడ్చల్ అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి సందర్శించారు. రెవెన్యూ అధికారులు సమయపాలన పాటించకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు. జిల్లా వ్యాప్తంగా 3,862 దరఖాస్తులు వచ్చాయని, అందులో 700 దరఖాస్తులను ఆమోదించినట్లు తెలిపారు. ఘట్‌కేసర్ మండలంలో 552 దరఖాస్తులు రాగా 120 దరఖాస్తులకు ఆమోదం తెలిపినట్లు పేర్కొన్నారు. ఘట్‌కేసర్ మండలంలో 15 మంది లైసెన్స్ సర్వేయర్లకు శిక్షణ ఇచ్చి పరీక్ష నిర్వహించగా అందులో ఇద్దరు ఉత్తీర్ణులయ్యారని తెలిపారు. మిగతా వారికి వచ్చే నెల 14న తిరిగి పరీక్షలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు డీఎస్.రజిని, డీటీ రాజేందర్, సర్వేయర్ రూప, సీనియర్ అసిస్టెంట్ అధిత్య, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



కాగ్నా వాగును పరిశీలిస్తున్న ఎస్పీ నారాయణరెడ్డి, సబ్ కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్

వినాయక నిమజ్జనానికి ఏర్పాట్లు పూర్తి

» 300 మంది పోలీసులతో బందోబస్తు

» వికారాబాద్ ఎస్పీ నారాయణరెడ్డి

యాలాల, ఆగస్టు 29, (ఆంధ్రజ్యోతి): తాండూరులో జరిగే వినాయక నిమజ్జనానికి అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఎస్పీ నారాయణరెడ్డి తెలిపారు. శుక్రవారం యాలాల మండల పరిధిలోని కోకట్ కాగ్నా నది, బ్రిడ్జీని తాండూడు సబ్ కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ వచ్చే ఆదివారం వినాకులను యాలాల మండల పరిధిలోని కోకట్ కాగ్నా బ్రిడ్జీ వద్ద నిమజ్జనం చేయాలన్నారు. మొత్తం 300 మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. నిమజ్జన సమయంలో యువకులు మద్యం సేవించొద్దని, ఎలాంటి గొడవలు జరిగినా సంబంధిత వ్యక్తులపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ప్రశాంత వాతావరణంలో శోభాయాత్ర జరిగేలా చూడాలన్నారు. కార్యక్రమంలో యాలాల తహసీల్దార్ వెంకటస్వామి, తాండూరు డీఎస్పీ బాలకృష్ణారెడ్డి, సీఐలు, యాలాల ఎస్‌ఐ విఠల్‌రెడ్డి, ఆర్‌ఐ వేణు పాల్గొన్నారు.

ఆశాలకు కనీస వేతనం చెల్లించాలి

కడ్తాల్, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం అసెంబ్లీ ఎన్నికలకు ముందు ప్రకటించిన విధంగా ఆశా కార్యకర్తలకు రూ.18 వేలు కనీస వేతనం చెల్లించాలని సీఐటీయు కడ్తాల మండల కన్వీనర్ పెంటయ్య డిమాండ్ చేశారు. లేనియెడల పెద్దఎత్తున ఉద్యమ కార్యాచరణ రూపొందిస్తామని తెలిపారు. మండల కేంద్రంలో ఆశా కార్యకర్తల సమస్యల పరిష్కారం కోసం నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. పెంటయ్య హాజరై మాట్లాడుతూ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీని కాంగ్రెస్ నిలబెట్టుకోవాలన్నారు. సీఐటీయు నాయకులు, ఆశాలు పాల్గొన్నారు.

మండల నూతన కమిటీ

ఆశా కార్యకర్తల కడ్తాల మండల నూతన కార్యవర్గాన్ని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా జ్యోతి, ప్రధాన కార్యదర్శిగా లావణ్య, కోశాధికారిగా సబిత, ఉపాధ్యక్షురాలిగా స్వరూప, భారతమ్మ, సహాయ కార్యదర్శులుగా అనిత, పద్మమ్మ, బుచ్చమ్మలు ఎన్నికయ్యారు. నూతన కమిటీ సభ్యులను పెంటయ్య అభినందించి సత్కరించారు.



సమావేశంలో మాట్లాడుతున్న పెంటయ్య

ఉత్తమ సాంకేతిక విద్య అందించడమే లక్ష్యం



కార్యక్రమంలో మాట్లాడుతున్న పాండురంగారెడ్డి

ఇబ్రహీంపట్నం, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి) ఇంజనీరింగ్ విద్యార్థులకు ఉత్తమ సాంకేతిక విద్య అందించడమే శ్రీదత్త కాలేజీ లక్ష్యమని చైర్మెన్ పాండురంగారెడ్డి అన్నారు. శుక్రవారం ఇంజనీరింగ్ మొదటి సంవత్సరం విద్యార్థులకు ఓరియేంటేషన్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హజరైన ఆయన మాట్లాడుతూ క్రమ శిక్షణతో కూడిన విద్యతో పాటు శాస్త్ర సాంకేతిక రంగంలో నూతనంగా వస్తున్న టెక్నాలజీకి అనుగుణంగా ఇంజనీరింగ్ విద్యార్థులను తీర్చిదిద్దడమే తమ కళాశాల లక్ష్యమన్నారు. ఇంటర్మీడియంట్ విద్యను పూర్తి చేసుకోని ఇప్పుడే వృత్తి పరమైన ఇంజనీరింగ్ విద్యలోకి అడుగుపెడుతున్నా విద్యార్థులు లక్ష్యం పెట్టుకొని ఉన్నత శిఖారాలకు చేరుకోవాలని సూచించారు. ఇంజనీరింగ్ విద్యతో పాటు మానవత విలువలతో కూడిన విద్యను నేర్పిస్తూ సమాజంలో ఉత్తమ ఇంజనీర్లను తయారుచేయడమే లక్ష్యమన్నారు. ఇంజనీరింగ్ కోర్స్ పూర్తి అయ్యేలోపు ప్రతి విద్యార్థికి ప్లేస్‌మెంట్స్ 100 శాతం ఇవ్వడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో కాలేజీ వైస్ చైర్మెన్ డాక్టర్ విభవ్‌రెడ్డి, సీఏండీ దేవేంద్ర విక్రమ్‌రెడ్డి, డైరెక్టర్ సంతోష్‌కుమార్, డాక్టర్ బానుప్రకాష్‌రెడ్డి, డాక్టర్ వెంకట అచ్యుతరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ సెంథిల్‌కుమార్, అధ్యాపకులు మధుసూదన్‌రెడ్డి, వివిధ విబాగాధిపతులు, విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా అడ్మినిస్ట్రేషన్ అధికారి మహమ్మద్ షఫియొద్దీన్

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

రంగారెడ్డి అర్బన్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): వైద్యారోగ్య సిబ్బంది విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని జిల్లా వైద్యారోగ్య శాఖ అడ్మినిస్ట్రేషన్ అధికారి మహమ్మద్ షఫియొద్దీన్ హెచ్చరించారు. శుక్రవారం మొయినాబాద్‌లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆస్పత్రి పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కేతిరెడ్డిపల్లి సబ్‌సెంటర్ సెకండ్ ఏఎన్‌ఎం గంగమ్మ విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహించడం, తరచూ గైర్హాజరవుతుండడంతో విచారించారు. ఆరోగ్య సమస్యతో హాజరుకావడం లేదని తెలుసుకొని నివేదికను డీఎంహెచ్‌వోకు అందజేయనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాల దృష్ట్యా సీజనల్ వ్యాధులు వ్యాపించకుండా ఆశా కార్యకర్తలు, ఏఎన్‌ఎంలు ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. జిల్లాలో జ్వర సర్వేను పకడ్బందీగా నిర్వహించాలన్నారు. పీహెచ్‌సీ తనిఖీలో ఆయనతోపాటు డీఎంహెచ్‌వో సూపరిండెంట్ ఈశ్వర్, సీనియర్ అసిస్టెంట్ మల్లికార్జున్, చేవెళ్ల డిప్యూటీ డీఎంహెచ్‌వో నాగేందర్‌బాబు, మొయినాబాద్ పీహెచ్‌సీ డాక్టర్ అన్నపూర్ణ ఉన్నారు.

గోదావరికి చకచకా క్లియరెన్స్‌లు!

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): మల్లన్నసాగర్ నుంచి గోదావరి జలాలను హైదరాబాద్ మహానగరానికి, జంట జలాశయాలను నింపి మూసీలో నీరు ప్రవహింపజేసే గోదావరి మల్టీ పర్పస్ ప్రాజెక్టుకు క్లియరెన్స్ చకచకా వస్తున్నాయి. మల్లన్నసాగర్ నుంచి హైదరాబాద్ వరకు రెండు వరుసల్లో 3,500 డయా సామర్థ్యం కలిగిన రెండు భారీ పైపులైన్లను ఏర్పాటు చేసేందుకు భూములు, వివిధ శాఖల అనుమతులు కావాల్సి ఉంది. ఇప్పటికే వాటర్‌బోర్డు అధికారులు ఆయా శాఖల ఉన్నతాధికారులతో చర్చించడంతో అనుమతులొస్తున్నాయి. హైదరాబాద్‌కు తాగునీరు, మూసీ ప్రక్షాళనకు గోదావరి ఫేజ్-2 మల్టీపర్పస్, ఫేజ్-3 ప్రాజెక్టులను వాటర్‌బోర్డు రూ.7,360కోట్లతో చేపడుతోంది. ఇందులో భాగంగా మల్లన్నసాగర్ నుంచి రెండు వరుసల పైపులైన్లతో 26 కిలోమీటర్ల దూరం ఉన్న శామీర్‌పేట మండలం ఘన్‌పూర్ వరకు నీటిని తరలిస్తారు. అక్కడ నీటిని శుద్ధి చేసి నగరానికి తరలిస్తారు. శుద్ధి చేయని నీటిని మరో పైపులైన్ ద్వారా ఉస్మాన్‌సాగర్(గండిపేట), హిమాయత్‌సాగర్‌లకు తరలించనున్నారు. ఫారెస్టు, ఇరిగేషన్, రెవెన్యూ, ఆర్‌అండ్‌బీ, హెచ్‌ఎండీఏ, పర్యావరణ ఇలా ఏడు శాఖల అనుమతులు సాధించాల్సి ఉన్నది. ఇప్పటికే ఫేజ్-1 కింద ఉమ్మడి రాష్ట్రంలోనే ఎల్లంపల్లిలోని ముర్మూరు నుంచి ఘన్‌పూర్ వరకు భూసేకరణ చేశారు. ప్రస్తుతం ఎల్లంపల్లి నుంచి ఫేజ్-2, ఫేజ్-3 నుంచి తీసుకురాకుండా మల్లన్నసాగర్ నుంచి జలాలు తేనున్నారు. ఇప్పటికే కొండపోచమ్మ, ఘన్‌పూర్ మధ్యలో కొన్ని భూములు సేకరించి వినియోగిసస్తున్నారు.

బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడికి ఎయిర్‌పోర్టులో ఘన స్వాగతం



ఇబ్రహీం శేఖర్‌ను సన్మానిస్తున్న ఆ పార్టీ నాయకుడు

శంషాబాద్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): బహుజన సమాజ్ పార్టీ తెలంగాణ రాష్ట్ర నూతన అధ్యక్షుడుగా ఎన్నికైన ఇబ్రహీం శేఖర్‌కు శుక్రవారం శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో ఆ పార్టీ కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో బీఎస్పీ బలపడటానికి శక్తివంచన లేకుండా కృషిచేస్తానన్నారు. బహుజనులకు రాజ్యాధికారం దక్కే అవకాశాలు బలంగా ఉన్నాయన్నారు. అందుకోసం రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న కార్యకర్తలను కలసి పార్టీని మరింతగా బలోపేతం చేస్తానని చెప్పారు. అంతకు ముందు నాగర్‌కర్నూల్‌కు చెందిన బీఎస్పీ నాయకులు పెద్ద సంఖ్యలో ఎయిర్‌పోర్టు మార్గంలో నూతన అధ్యక్షుడికి స్వాగతం పలికారు.

వర్షాలకు కూలిన ఇల్లు


టేకుల్‌కోడ్ తాండలో కూలిన ఇల్లు

కొడంగల్ రూరల్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలకు శుక్రవారం తెల్లవారు జామున ఒక్కసారిగా ఇల్లు కూలిపోయింది. వివరాల్లోకి వెళ్తే.. టేకుల్‌కోడ్ పంచాయతీకి అనుబంధంగా ఉన్న టేకుల్‌కోడ్ తండాకు చెందిన హన్మంతు నాయక్ కుటుంబసభ్యులతో బతుకుదెరువు నిమిత్తం ముంబై వలస వెళ్లి అక్కడే కూలి పనులు చేస్తూ జీవిస్తున్నాడు. తండాలో ఉన్న ఇంటికి తాళం వేసి వెళ్లడంతో కురుస్తున్న వర్షాలకు గోడలు పూర్తిగా నాని కూలిపోయాయి.

ఉచిత విద్యుత్ వామపక్షాల పోరాట ఫలితమే


కొవ్వొత్తులతో అమరులకు నివాళులర్పిస్తున్న నాయకులు

యాలాల, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): వామపక్ష పార్టీలు 25ఏళ్ల కిందట చేసిన పోరాట ఫలితంగానే ప్రజలకు ఉచిత విద్యుత్ అందుతోందని సీపీఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యులు యు.బుగ్గప్ప అన్నారు. మండల కేంద్రంలో గురువారం రాత్రి విద్యుత్ పోరాట అమరులకు కొవ్వొత్తులతో నివాళులర్పించారు. బుగ్గప్ప, ఉప్పలి మల్కయ్య మాట్లాడుతూ.. నాటి ప్రభుత్వం ప్రపంచ బ్యాంకు సంస్కరణల్లో భాగంగా విద్యుత్‌రంగాన్ని ప్రైవేటుపరంగా చేయడానికి ప్రయత్నాలు చేసిందన్నారు. విద్యుత్ ఉద్యమానికి కమ్యునిస్టు పార్టీలు పిలుపునివ్వగా అన్యాయంగా కాల్పులు జరిపారని, దీంతో ఎందరో అమరులయ్యారని గుర్తుచేశారు. వారి త్యాగం వల్లే నేడు ప్రజలకు విద్యుత్ అందుతోందన్నారు. కార్యక్రమంలో నర్సింహులు, వేణుగోపాల్, లాలప్ప, హన్మంతు, రమేశ్, శివకుమార్, మహేశ్, నరేష్, సామెల్ తదితరులు పాల్గొన్నారు.

హిందూ ఉత్సవ సమితికి భారీ విరాళం


విరాళాన్ని అందజేస్తున్న రినీష్‌రెడ్డి

తాండూరు, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): తాండూరు హిందూ ఉత్సవ కేంద్ర సమితికి తెలంగాణ రాష్ట్ర సమితి చీఫ్‌విప్ మహేందర్‌రెడ్డి తన కుమారుడు రినీష్‌రెడ్డి చేతుల మీదుగా శుక్రవారం భారీ విరాళాన్ని అందజేశారు. తాండూరులోని తన నివాసంలో రూ.3లక్షల 1016లను సమితి సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ సమితి ప్రధాన కార్యదర్శి పట్లోళ్ల నర్సిములు, రవీందర్, బీర్కడ్ రఘు, పునిత్, రామకృష్ణ, వెంకటేష్ ఉన్నారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

తాండూరు, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగిఉండాలని న్యాయవాదులు జిలాని, సుదర్శన్, ఆనంద్ అన్నారు. మండల లీగల్‌సర్వీస్ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం పట్టణంలోని శ్రీచైతన్య పాఠశాలలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. న్యాయవాదులు మాట్లాడుతూ విద్యాహక్కు చట్టం 2009 ప్రకారం 6 నుంచి 14 సంవత్సరాల విద్యార్థులు తప్పనిసరిగా ఉచిత నిర్బంధ విద్యను అభ్యసించాలన్నారు. ఆర్టికల్ 21ఏ ప్రకారం భారత రాజ్యాంగం విద్యార్థులకు విద్య ప్రాథమిక హక్కు కల్పించిందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ శ్రీనివాస్‌రావు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రీ-రిపబ్లిక్ డే క్యాంప్ ఎంపికలు


ఎంపికల్లో ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు

ఘట్‌కేసర్ రూరల్, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): పోచారం మున్సిపాలిటీ, వెంకటాపూర్ అనురాగ్ యూనివర్సిటీలో శుక్రవారం ప్రీ-రిపబ్లిక్ డే ఎంపికలు నిర్వహించారు. ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు ఎనిమిది యూనిట్ల నుంచి పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ఎన్‌ఎస్‌ఎస్ కేంద్ర ప్రాంతీయ సంచాలకులు నర్సింహాగౌడె ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు.ఎన్‌ఎస్‌ఎస్, ఎన్‌సీసీలో చేరి విద్యార్థులు దేశానికి సేవ చేయాలని, వారికి ఆర్మీ తరహాలో శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. 45మంది వలంటీర్లు ఎనిమిది యూనిట్లకు ప్రాతినిత్యం వహించనున్నట్లు తెలిపారు. ఎంపికైన వాలీంటర్లను అనురాగ్ యూనివర్సిటీ సీఈవో నీలిమా అభినందించారు. ఈ కార్యక్రమంలో సంజయ్‌నాయక్, మల్లేష్, అధ్యాపకులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు


ఇందిరమ్మ కమిటీల సమావేశంలో నాయకులు

మేడ్చల్ టౌన్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి) అర్హులందరికి ఇందిరమ్మ ఇల్లు లభించే విధంగా చర్యలు తీసుకుంటున్నామని గుండ్లపోచంపల్లి మున్సిపల్ కమిషనర్ ఆర్.వెంకట గోపాల్ అన్నారు. ఆయన శుక్రవారం ఇందిరమ్మ కమిటీతో సమావేశం నిర్వహించారు. ఇందిరమ్మ పథకం కింద దరఖాస్తు చేసిన అర్హులైన ప్రతి ఒక్కరినీ ఎంపిక చేస్తున్నామన్నారు. మున్సిపల్ పరిధిలో అర్హులు, అనర్హుల జాబితాను కమిషనర్ సమావేశంలో వెల్లడించారు. ఈ సమావేశం అనంతరం మున్సిపల్ పరిధిలో చేపట్టనున్న గణేష్ నిమజ్జనం ఏర్పాట్లలో భాగంగా స్థానిక చెరువులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ వైస్‌చైర్మన్ ప్రభాకర్, మాజీ కౌన్సిలర్ సాయిపేట శ్రీనివాస్ యాదవ్, మున్సిపల్ మేనేజర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

అనర్హులకు ఇళ్లు మంజూరు చేశారు: బీజేపీ

అర్హులకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేశారని మేడ్చల్ మున్సిపల్ బీజేపీ అధ్యక్షురాలి శైలజ ఆరోపించారు. ఇందిరమ్మ లబ్ధిదారుల ఎంపిక పట్ల శుక్రవారం బీజేపీ ఆయకులు విలేకరుల సమావేశం నిర్వహించారు. మేడ్చల్‌లో రాజకీయ పక్షపాతంతో ఇందిరమ్మ లబ్ధిదారుల ఎంపిక జరిగిందన్నారు. కాంగ్రెస్ పార్టీకి అనుకూలంగా ఉన్న వారికి ఇందిరమ్మ పత్రాలు అందజేశారని ఆరోపించారు. లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను మున్సిపల్ కార్యాలయంలో కాంగ్రెస్ నాయకుల సమక్షంలో నిర్వహించారని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో పార్టీ ప్రధాన కార్యదర్శి జాకట ప్రేమ్‌దాస్, వంశీ విజయ్, నాయకులు విష్ణుమూర్తి, రాఘవరెడ్డి, నర్సింగ్ రావు పాల్గొన్నారు.

పంచాయతీలు.. అప్పులపాలు!

- భారంగా మారిన నిర్వహణ
- 16 నెలలుగా నిలిచిన నిధులు
- సామగ్రి తెచ్చుకోలేని దుస్థితి
- చేతులెత్తేసే స్థితిలో కార్యదర్శులు


కందవెల్లి గ్రామ పంచాయతీ కార్యాలయం

తాండూరు, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): నిర్వహణకు నిధులు రావడం లేదు. చేసిన పనులకు సంబంధించి చెక్కులు పెండింగ్‌లో ఉన్నాయి. బజారులో దుకాణదారులు సామగ్రి ఇచ్చేందుకు ముందుకు రావడం లేదు. ఈ సమస్యలతో సతమతమవుతుంటే.. పైనుంచి పనులు చేయాలని ఒత్తిళ్లు. ఇదీ ప్రస్తుతం గ్రామస్థాయిలో విధులు నిర్వర్తించే పంచాయతీ కార్యదర్శుల పరిస్థితి. ఆర్థిక వనరులు(నిధులు) లేక సరైన సిబ్బంది లేక సతమతమవుతున్నామని కార్యదర్శులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. 16నెలలుగా గ్రామ పంచాయతీల నిర్వహణకు ఎలాంటి నిధులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి రావడం లేదు. పది నెలలుగా చెక్కులు పెండింగ్‌లోనే ఉండడంతో ఉద్దెర ఇచ్చేందుకు దుకాణదారులు, డీజిల్ పోసేందుకు పెట్రోల్ బంకులో నిర్వాహకులు నిరాకరిస్తున్నారు. ఫలితంగా సొంతంగా అప్పులు తెచ్చి మరి గ్రామ పంచాయతీలను నిర్వహించాల్సి వస్తోందని కార్యదర్శులు వాపోతున్నారు. రూ.లక్షల్లో అప్పులు చేయాల్సి వస్తుందని కార్యదర్శులు అంటున్నారు. తమ పరిస్థితి అడకత్తెరలో పోక చెక్కలా తయారైందని వాపోతున్నారు.

వీటికి ఖర్చు ఎలా?

నిర్వహణ నిధులు విడుదల కాకపోవడంతో తాండూరు అసెంబ్లీ నియోజకవర్గంలో తాండూరు, యాలాల, బషీరాబాద్, పెద్దేముల్ మండలాల్లో పని చేస్తున్న పంచాయతీ కార్యదర్శులు ట్రాక్టర్ ద్వారా చెత్త నిర్వహణ, ట్రాక్టర్ కిస్తులు చెల్లింపు, మోటార్ రిపేర్లు, వీధిదీపాల నిర్వహణ, పైప్‌లైన్ల లీకేజీలు, జీతాల చెల్లింపులు భారంగా మారాయి. గ్రామాల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లడం, గడ్డి మందు పిచికారి చేయడం వంటి వాటికి నిధులు లేక ఇతర వ్యక్తులను ప్రాధేయపడాల్సి వస్తోంది. నిధులు వెచ్చించి పనులు చేయండి. ఎంబీ చేయించి నిధులు వచ్చాక బిల్లులు ఇస్తామని ప్రాధేయ పడుతున్నారు. త్వరలోనే ఈ సేవలను నిలిపి వేయాలని, తాము ఏం చేయలేమంటూ కార్యదర్శులు చేతులేత్తేసే పరిస్థితి ఉంది.

వర్షార్పణం

(ఐదో పేజీ తరువాయి)

రైతులు కన్నీటి పర్యంతమవుతున్నారు. కొట్టుకుపోయి, కోతకు గురైన పంటల పరిస్థితి ఏమిటనేది రైతులు ఆందోళన చెందుతున్నారు. పరిగి, ధారూరు, కొడంగల్, పెద్దేముల్, పూడూరు, వికారాబాద్, బషీరాబాద్, దోమ, తాండూరు, కోట్‌పల్లి మండలాల్లో 2,700 ఎకరాల్లో పంటలకు నష్టం వాటిల్లింది. 1,260 ఎకరాల్లో 730 మంది రైతులు సాగు చేసిన పత్తి పంటకు నష్టం జరిగింది. 302 ఎకరాల్లో 146 మంది రైతులు సాగు చేసిన వరి పంట, 319 ఎకరాల్లో 162 మంది పండించిన కంది పంట, 83 ఎకరాల్లో ఇతర పంటలు వరద ఉధృతికి కొట్టుకుపోయాయి. 379 ఎకరాల్లో 213 మంది రైతులు సాగు చేసిన పెసర, 357 ఎకరాల్లో 197 మంది రైతులు పండించిన మొక్కజొన్న పంటలకు నష్టం వాటిల్లింది.

33శాతానికి పైగానే..

జిల్లాలో కూరగాయలు, ఆకుకూర పంటలకు కూడా తీవ్రంగా నష్టం జరిగింది. సాగు చేసిన పంటలు కొన్ని చోట్ల వరద నీటిలో మునిగిపోతే.. మరికొన్నిచోట్ల వరద ఉధృతికి కొట్టుకుపోయాయి. అలాగే ఇతర ఉద్యాన వన పంటలకు కూడా వరద ఉధృతితో నష్టం వాటిల్లింది. జిల్లాలో 200 ఎకరాలకు పైగానే కూరగాయ పంటలు వరద నీటిలో మునిగిపోయాయి. టమాట, క్యారెట్, వంకాయ, బీర, క్యాబేజీ, కాలీఫ్లవర్ వంటి పంటలకు తీవ్ర నష్టం వాటిల్లిందని రైతులు వాపోతున్నారు. కాగా, క్షేత్ర స్థాయిలో నిర్వహించిన సర్వేలో జిల్లాలో 42 మంది రైతులు సాగు చేసిన 65 ఎకరాల ఉద్యాన పంటలకు నష్టం వాటిల్లినట్లు ఉద్యాన శాఖ అధికారులు తేల్చారు. పసుపు 28 ఎకరాలు, బొప్పాయి 2 ఎకరాలు, టమాట 6 ఎకరాలు, వంకాయ ఎకరా, బీట్‌రూట్ ఎకరా, క్యారెట్ 23 ఎకరాలు, పొట్లకాయ 2 ఎకరాలు, బంతి పంట 2 ఎకరాల మేరకు నష్టం జరిగినట్లు ఉద్యానవన శాఖ అధికారులు చెబుతున్నారు. ఈ పంటలన్నీ 33 శాతానికి పైగానే నష్టపోయినట్లు ఉద్యాన శాఖ అధికారులు గుర్తించారు.

ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాగానే..



ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో పంటలకు తీవ్ర నష్టం కలుగుతోంది. నీట మునిగిన అన్ని పంటలకు నష్టం జరగదు. వర్షం నుంచి కొంత తెరిపివ్వగానే కొన్ని పంటలు తేరుకుంటాయి. వ్యవసాయాధికారుల సూచనలు, సలహాలు పాటిస్తే నీట మునిగిన పంట మొక్కలను కుళ్లిపోకుండా, తెగుళ్ల సోకకుండా కాపాడుకోవచ్చు. పంట నష్టంపై ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చిన తర్వాత క్షేత్ర స్థాయిలో వెళ్లి నష్టపోయిన పంటల విస్తీర్ణం, నష్టం జరిగిన శాతం రైతుల వారీగా వివరాలు సేకరించి నివేదిక అందజేస్తాం.

- రాజారత్నం, జిల్లా వ్యవసాయాధికారి, వికారాబాద్

యూరియా కోసం రోడ్డెక్కిన రైతులు

(ఐదో పేజీ తరువాయి)

రోడ్డెక్కుతుంటే కాంగ్రెస్ ప్రభుత్వానికి కనీసం సోయిలేదన్నారు. పోలీసుల అరెస్ట్‌లకు భయపడేదిలేదన్నారు. ఈ కార్యక్రమంలో అరవింద్‌రావు, ఆర్.ఆంజనేయులు, సురేందర్, అశోక్, నాయకులు పాల్గొన్నారు.

ధారూర్‌లో వినూత్న నిరసన

ధారూరులోని పీఏసీఎస్ కార్యాలయం ఎదుట మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్ ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్ నేతలు దున్నపోతుతో వినూత్న నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వికారాబాద్ నియోజకవర్గంలో ఎక్కడ చూసినా రైతులు యూరియా కోసం తిండితిప్పలు లేకుండా లైన్లలో నిల్చున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. రైతులు పడుతున్న గోస సీఎం రేవంత్‌రెడ్డి, స్పీకర్ ప్రసాద్‌కుమార్‌కు పట్టడం లేదని మండిపడ్డారు. పోలీస్ పహారా పెట్టి రైతు ఒక్క సంచి యూరియా సరఫరా చేయటం దారణమన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ప్రజలు కర్రు కాల్చి వాత పెట్టటం ఖాయమన్నారు. రోడ్డుపై వాహనాల రాకపోకలకు అంతరాయం కలుగడంతో పోలీసులు వారిని అదుపులోకి తీసుకొని రోడ్డును క్లియర్ చేశారు. కార్యక్రమంలో శ్రీకాంత్ రెడ్డి, వేణుగోపాల్ రెడ్డి, రాములు, హాఫీజ్, రాములు తదితరులు పాల్గొన్నారు.


ధారూరు: ధారూరు చౌరస్తాలో రోడ్డుపై బైఠాయించిన మాజీ ఎమ్మెల్యే ఆనంద్

గణపయ్యకు ఘనమైన పూజలు

ఘట్‌కేసర్ రూరల్/తాండూరు/బొంరాస్‌పేట్/దుద్యాల, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మూడవరోజు శుక్రవారం పోచారం, ఘట్‌కేసర్ మున్సిపాలిటీల్లో గణపయ్యలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అవుశాపూర్‌లోని భజరంగ్ యువజన సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక మండపంలో బీఆర్‌ఎస్ ప్రధానకార్యదర్శి పన్నాల కొండల్‌రెడ్డి ప్రత్యేకపూజలు ప్రత్యేకపూజలు నిర్వహించారు. అదేవిధంగా తాండూరు పట్టణంలోని యశోద నగర్‌లో వినాయక ఉత్సవ సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణనాథుడిని మూడు రోజులకు నిమజ్జనం చేశారు. జిల్లా మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజుగౌడ్, కాలనీవాసులు జుంటుపల్లి అరవింద్ కుమార్‌రెడ్డి, మధుగౌడ్ తదితరులు శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. కాలనీ వాసులు గణపతి ఎదుట నృత్యాలు చేస్తూ గణపతికి వీడ్కోలు చెప్పారు. అనంతరం కాగ్నా నదిలో గణనాథుడిని నిమజ్జనం చేశారు. బొంరాస్‌పేట్ మండల కేంద్రంలోని అభయాంజనేయస్వామి ఆలయంలో ప్రతిష్ఠించిన గణనాథుడికి గ్రామస్థులు పూజలు నిర్వహించారు. పూజల అనంతరం భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. దుద్యాల మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో ప్రతిష్ఠించిన గణనాథులు భక్తులతో నిత్య పూజలందుకుంటున్నారు. కొడంగల్ సీఐ శ్రీధర్‌రెడ్డి, దుద్యాల ఎస్ఐ యాదగిరి శుక్రవారం గణనాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.


ఘట్‌కేసర్ రూరల్: అవుశాపూర్‌లో వినాయక పూజలో బీఆర్‌ఎస్ నాయకులు కొండల్‌రెడ్డి


తాండూరు: యశోదనగర్‌లోని గణనాథుడిని నిమజ్జనానికి తరలిస్తున్న కాలనీవాసులు

సబ్సిడీపై పరికరాలను వినియోగించుకోవాలి

తాండూరు రూరల్, ఆగస్టు 29, (ఆంధ్రజ్యోతి): ఎస్ఎంఏఎం పథకం కింద కేంద్రప్రభుత్వం రైతులకు 40-50శాతం సబ్సిడీపై స్ప్రేయర్లు, వ్యవసాయ యంత్ర పరికరాలు అందజేస్తున్నట్లు తాండూరు వ్యవసాయశాఖ ఇన్‌చార్జి ఏడీఏ కొమరయ్య అన్నారు. పనిముట్ల కోసం దరఖాస్తు చేసుకునేందుకు రైతులు వచ్చే మంగళవారం దరఖాస్తులను వ్యవసాయాధికారి కార్యాలయంలో అందజేయాలని ఏడీఏ సూచించారు. ఇదివరకు సబ్సిడీపై పరికరాలు పొందిన వారు ప్రస్తుతం దరఖాస్తు చేసుకునేందుకు అర్హులు కారని స్పష్టం చేశారు.

ఓటరు జాబితాలో తప్పులు

దోమ, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి) గ్రామ పంచాయతీలో ప్రదర్శించిన ఓటరు జాబితాలో తప్పులు దొర్లాయని మండల సర్పంచ్‌ల సంఘం మాజీ అధ్యక్షుడు రాజీరెడ్డి ఆరోపించారు. ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ పంచాయతీ ఓటరు జాబితాలో మొత్తం తప్పులు ఉన్నాయని ఎంపీడీవో గ్యామానాయక్ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. ఓటరు జాబితా సవరణకు అధికారులు చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

మోడల్‌స్కూల్‌లో అడ్మిషన్లు

పెద్దేముల్, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): గొట్లపల్లి మోడల్‌స్కూల్‌లో స్పాట్ అడ్మిషన్లు జరుగుతున్నాయని ప్రిన్సిపల్ గాయత్రి శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. గొట్లపల్లి సమీపంలోని తెలంగాణ మోడల్‌స్కూల్‌లో 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు, ఇంటర్ ప్రథమసంవత్సరంలో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, ఎంఈసీలలో మిగిలి ఉన్న సీట్లకు ఆఫ్‌లైన్‌లోనే స్పాట్ అడ్మిషన్లు జరుగుతున్నాయని చెప్పారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు పాఠశాల పనివేళలలో సంప్రదించగలరని కోరారు.

మాతృభాషపై మమకారం పెంచుకోవాలి


రామ్మూర్తి, ధ్యాన్‌చంద్ చిత్రపటాల వద్ద నివాళులర్పిస్తున్న ప్రముఖ కవి చంద్రశేఖర్

తాండూరు, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): మాతృభాషపై మమకారం పెంచుకోవాలని ప్రముఖ కవి కోటం చంద్రశేఖర్ అన్నారు. పాత తాండూరు ప్రభుత్వ నంబర్-2 పాఠశాలలో గిడుగు రామ్మూర్తి, హాకీ క్రీడాకారుడు ధ్యాన్‌చంద్ జయంతి పురస్కరించుకొని పాఠశాలలో తెలుగుభాష, క్రీడా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొని చంద్రశేఖర్ మాట్లాడారు. మన భాష, మన ఆత్మ క్రీడ, మన శక్తి కలిసినప్పుడే విద్యార్థుల వ్యక్తిత్వం సంపూర్ణంగా వికసిస్తుందన్నారు. విద్యార్థులు క్రీడల్లో రాణించాలన్నారు. వికారాబాద్ జిల్లా టీయూడబ్ల్యూజే జర్నలిస్టు యూనియన్ అధ్యక్షుడు కందనెల్లి శ్రీనివాస్ చారీ మాట్లాడుతూ.. భాషలు ఎన్ని ఉన్నా మాతృభాషను మరువరాదన్నారు. విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను ఉపాధ్యాయులు వెలికితీసి సమాజానికి అందించాలన్నారు. కవయిత్రి మొల్ల కళావేదిక ఫౌండర్ అధ్యక్షుడు మొలక ప్రతినిధి కేవీఎం వెంకట్ మాట్లాడుతూ మొలక పుస్తకం ద్వారా విద్యార్థులకు బాల్య దశలోనే సాహిత్యపు బాటలు వేస్తున్నట్లు తెలిపారు. అనంతరం విద్యార్థులు పొడుపు కథలు, పద్యాలు తెలుగు భాష పాటలతో కూడిన నృత్యాలతో అలరించారు. హెచ్ఎం ప్రతిభ భారతి, మనోహర్ పాల్గొన్నారు.

ఘనంగా స్పోర్ట్స్‌డే

కొడంగల్ రూరల్: హాకీ క్రీడాకారుడు ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకుని కొడంగల్ శివారులోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాలలో శుక్రవారం జాతీయ క్రీడాదినోత్సవాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా ధ్యాన్‌చంద్ చిత్రపటానికి ప్రిన్సిపాల్ రామదాసు గారు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ పద్మ, వ్యాయామ ఉపాధ్యాయులు మేరీజోన్స్, వెంకటేష్ పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

'సీఎంఆర్ఎఫ్ చెక్కు ఇవ్వడం లేదు'

బొంరాస్‌పేట్: ప్రభుత్వం మంజూరు చేసిన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును ఇవ్వడం లేదని బీఆర్ఎస్ మండల ఉపాధ్యక్షుడు నెహ్రూనాయక్ శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కొందరు నాయకులు అధికారులను అడ్డం పెట్టుకొని చెక్కులను ఇతరుల పేర్లపై మార్చుకొని డబ్బులు స్వాహా చేస్తున్నారని విమర్శించారు.

విద్యార్థులకు చేయూతనివ్వడమే ధ్యేయం

శామీర్‌పేట: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పేద విద్యార్థులను చేరదీసి వారికి చేయూతనివ్వడమే తన ధ్యేయమని మాజీ ఉపసర్పంచ్ ప్రభాకర్‌రెడ్డి అన్నారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు కోరిన మేరకు శుక్రవారం అలియాబాద్ ఎస్సీ కాలనీలోని ప్రాథమిక పాఠశాలకు దాత ఆ గ్రామ మాజీ ఉపసర్పంచ్ ప్రభాకర్‌రెడ్డి విద్యార్థులకు టై,బెల్టులను అలాగే ఉపాధ్యాయులకు బీరువాను విరాళంగా అందజేశారు.

రాష్ట్ర సదస్సును విజయవంతం చేయాలి

శామీర్‌పేట: పారిశుధ్య కార్మికుల సమస్యలపై నగరంలో నిర్వహిస్తున్న రాష్ట్ర సదస్సును విజయవంతం చేయాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర సహాయకార్యదర్శి శివబాబు పిలుపునిచ్చారు. శామీర్‌పేటలో ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి మెరుగు శ్రీకాంత్ ఆధ్వర్యంలో శుక్రవారం ఐఎఫ్‌టీయూ నాయకులు పోస్టర్‌ను ఆవిష్కరించారు. వచ్చే నెల సెప్టెంబరు 7న నగరంలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సదస్సు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు.

ఓటరు జాబితాపై సమావేశం

కోట్‌పల్లి: మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో శనివారం ఉదయం 11.00 గంటలకు రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో డానియల్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇటీవల గ్రామాల్లో ప్రదర్శించిన ఓటరు జాబితాపై చర్చించడమే ఈ సమావేశ ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు.

బాధితులకు పరామర్శ


బాధితులను పరామర్శిస్తున్న నాయకులు

బొంరాస్‌పేట్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): తుంకిమెట్ల శివారులో హైదరాబాద్-బీజాపూర్ హైవేలో బుధవారం తెల్లవారుజామున గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో 70గొర్రెలు మృత్యువాతపడిన విషయం విదితమే. శుక్రవారం బీజేపీ మండల అధ్యక్షుడు శ్రావణ్‌గౌడ్, నాయకులు బంటు రమేశ్, ముకుంద్, నాగురావు తదితరులు బాధితులు నాందర్‌పూర్ గ్రామానికి చెందిన గిరిని మల్కప్ప, రాయికంటి ఎల్లప్పలను పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రమాద ఘటనతో బాధితులకు రూ.10లక్షల నష్టం వాటిల్లిందని, ప్రభుత్వం వారిని ఆదుకోవాలన్నారు.

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

మూడుచింతలపల్లి, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతిచెందిన ఘటన శామీర్‌పేట్ పోలీస్ స్టేషన్ పరిధిలో శుక్రవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. చేర్యాలకు చెందిన రామచర్ల కనకయ్య(55) బతుకుదెరువు నిమిత్తం 30ఏళ్ల కిందట మూడుచింతలపల్లి మున్సిపాలిటీకి వలస వచ్చి జగ్గంగూడ పరిధిలో ఉన్న శ్రేయస్ గ్రేప్ గార్డెన్‌లో పనిచేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. రోజువారీలాగే పని ముగించుకుని తన బైక్‌పై అలియాబాద్‌లోని తన ఇంటికి వస్తున్నాడు. ఈ క్రమంలో అలియాబాద్ పరిధిలో క్రేన్‌డ్రైవర్ అజాగ్రత్తగా రాంగ్‌రూట్‌లో వచ్చి ఎదురుగా వస్తున్న కనకయ్యను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో కనకయ్య తలకు బలమైన గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రైలుకింద పడి గుర్తుతెలియని వ్యక్తి..

ఘట్‌కేసర్ రూరల్, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): రైలుకింద పడి గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన ఘట్‌కేసర్ రైల్వే స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. రైల్వేపోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఘట్‌కేసర్ రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధి యంనంపేట రైల్వే వంతెన సమీపంలో రైలు పట్టాలపై గుర్తుతెలియని వ్యక్తి వయస్సు(45) మృతదేహాన్ని గమనించిన రైల్వే పైలట్ ఇచ్చిన సమాచారం మేరకు రైల్వే పోలీసులు ఘటన స్థలానికి చేరుకున్నారు. పరిసరాలను పరిశీలించినా ఆచూకీ లభ్యం కాలేదు. గుర్తుతెలియని రైలు ఢీకొట్టడంతో అతను అక్కడికక్కడే దుర్మరణం చెందాడని రైల్వే పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే పోలీసులు తెలిపారు.

గల్లంతైన వ్యక్తి మృతదేహం లభ్యం


మృతదేహాన్ని బయటకు తీసుకొస్తున్న బోటింగ్ లైఫ్‌గార్డ్స్

కోట్‌పల్లి, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): గల్లంతైన వ్యక్తి మృతదేహం లభ్యమైన ఘటన కోట్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్ఐ శైలజ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండల కేంద్రంలోని వాగులో బుధవారం గల్లంతైన చాకలి సంగమేశ్వర్(38) అనేవ్యక్తి కోసం ధారూర్ సీఐ రఘురాములు పర్యవేక్షణలో గాలింపు చర్యలు చేపట్టారు. జస్టిస్ కొండా మాధవరెడ్డి ఫౌండేషన్, ప్రోగ్రెసివ్ తెలంగాణ ఫౌండేషన్, కోట్‌పల్లి బోటింగ్ లైఫ్ గార్డ్స్ సాయంతో వాగులో గాలించారు. శుక్రవారం ఉదయం సుమారు 7గంటలకు సంగమేశ్వర్ మృతదేహం లభ్యమైంది. వెంటనే మృతదేహాన్ని వెలికితీసి మర్పల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగించినట్లు ఎస్ఐ శైలజ తెలిపారు.

మట్టి తరలిస్తున్న టిప్పర్ పట్టివేత

మూడుచింతలపల్లి, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): అనుమతులు లేకుండా మట్టిని తరలిస్తున్న టిప్పర్‌ను రెవెన్యూ అధికారులు శుక్రవారం పట్టుకుని రెవెన్యూ కార్యాలయానికి తరలించారు. డీటీ సునీల్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. ములుగు మండలం నుంచి మూడుచింతలపల్లి మున్సిపల్‌లోని కొల్తూర్ పరిధిలో ఉన్న పరిశ్రమకు టిప్పర్ ద్వారా అక్రమంగా మట్టిని తరలిస్తున్నారన్న సమాచారంతో రెవెన్యూ అధికారులు నారాయణపూర్ వద్ద టిప్పర్‌ను ఆపి తనిఖీ చేశారు. మట్టి తరలింపునకు సంబంధించి ఎలాంటి అనుమతులు లేకపోవడంతో టిప్పర్‌ను స్వాధీనం చేసుకుని రూ.25వేలు జరిమానా విధించినట్లు తెలిపారు.

గుండెపోటుతో బీజేపీ నేత మృతి

బేగంపేట, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): మేడ్చల్ జిల్లా బీజేపీ లీగల్ సెల్ కో-కన్వీనర్ పిట్ల అశోక్‌కుమార్ ముదిరాజ్(54) రెండు రోజుల కిందట దుబాయిలో గుండెపోటుతో మృతిచెందాడు. బేగంపేటలోని అల్లంతోటబాయి ప్రాంతానికి చెందిన పిట్ల అశోక్ కుమార్ ముదిరాజ్ చిన్నతనం నుంచే బీజేపీలో పనిచేస్తూ డివిజన్ అధ్యక్షుడి నుంచి జిల్లాస్థాయిలో పలు పదవులను పొందాడు. ప్రస్తుతం బీజేపీ మేడ్చల్ జిల్లా లీగల్‌సెల్ కో-కన్వీనర్ ఉన్నాడు. ఐటీ ఉద్యోగి అయిన ఆయన నెలరోజుల కిందట ఆఫీసు పనిపై దుబాయికి వెళ్లాడు. అక్కడ రెండు రోజుల కిందట గుండెపోటు రావడంతో మృతిచెందాడు. బేగంపేటలోని అల్లంతోటబాయిలోని నివాసానికి శుక్రవారం పిట్ల అశోక్ మృతదేహం రావడంతో బీజేపీ నేతలు ఆయన మృతదేహానికి నివాళులర్పించారు. మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచరంద్‌రావులు ఫోన్‌లో కుటుంబసభ్యులను పరామర్శించారు.

పంటల సాగులో జాగ్రత్తలు పాటించాలి

కొడంగల్ రూరల్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): అధిక వర్షాల నేపథ్యంలో రైతులు పంటల సాగులో జాగ్రత్తలు పాటించాలని తాండూరు టీఆర్‌వీకే కేంద్రం నుంచి వచ్చిన శాస్త్రవేత్తలు రాజేశ్వర్ రెడ్డి, మధుశేఖర్‌లు అన్నారు. రుద్రారం రైతు వేదికలో క్లస్టర్ పరిధిలోని రైతులతో శుక్రవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో అధిక వర్షాల వల్ల ప్రధాన పంటల సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలను రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి తులసి, శ్రీపతిరెడ్డి పాల్గొన్నారు.

ఉత్తమ సేవలతో ప్రజల్లో గుర్తింపు


వెంకటేశ్‌ను సన్మానిస్తున్న ఆంజనేయులు, మొగులయ్య

కులకచర్ల, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో ఉత్తమ సేవలందించిన ఉద్యోగులకు ప్రజల్లో గుర్తింపు లభిస్తుందని మార్కెట్‌కమిటీ చైర్మన్ ఆంజనేయులు, సొసైటీ చైర్మన్ మొగులయ్య అన్నారు. తిరుమలాపూర్ ప్రాథమిక పాఠశాల హెచ్ఎం వెంకటేశ్ ఉద్యోగ విరమణ కార్యక్రమాన్ని శుక్రవారం స్థానిక పీజేఆర్ ఫంక్షన్ హాల్‌లో పీఆర్టీయూ ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఈవో హబీబ్ అహ్మద్, పీఆర్టీయూ నాయకులు రాఘవేందర్‌రెడ్డి, బస్వరాజ్, పాల్గొన్నారు.

విద్యార్థులకు అర్థమయ్యేలా బోధించాలి

బొంరాస్‌పేట్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులు విద్యార్థులకు అర్థమయ్యే విధంగా బోధించాలని ఎంఈవో హరిలాల్ అన్నారు. మండల కేంద్రంలోని విద్యావనరుల కేంద్రంలో శుక్రవారం మండలంలోని వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు శిక్షణ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, అబ్జర్వర్‌లు నవీన్‌కుమార్, ఎమ్మార్సీ సిబ్బంది పాల్గొన్నారు.

దోమ: కిష్టాపూర్ పాఠశాలను జీహెచ్ఎం లాల్యానాయక్ సందర్శించారు. ఎన్‌రోల్‌మెంట్, ఎఫ్ఆర్ఎస్, ఆన్‌లైన్ నమోదు తదితర వాటి గురించి ఉపాధ్యాయులతో అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో హెచ్ఎం అనంతయ్య, సీఆర్పీ రెడ్యానాయక్, ఉపాధ్యాయులు చైతన్య, రాజ్‌కుమార్, రాధిక, బాలకృష్ణ పాల్గొన్నారు.

పరిగి: జెడ్పీహెచ్ఎస్ నంబర్ 1 పాఠశాలలో ఎంఈవో గోపాల్ అన్ని ప్రభుత్వ పాఠశాలలు, రెసిడెన్షియల్ స్కూళ్ల హెచ్ఎంలతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. మధ్యాహ్నభోజనం హాజరు శాతం యాప్‌లో విధిగా నమోదు చేయాలని సూచించారు. ఆన్‌లైన్ ఎంట్రీ అప్‌డేట్ చేసే విధానం నిరంతరం కొనసాగించాలన్నారు.